10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శనివారం | 30 నవంబర్ 2024 | పేజీలు 8



ఫాక్స్‌సాగర్ నాలాపై అక్రమ నిర్మాణం బయట తాళం లోపల పనులు..

- కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారుల సౌజన్యంతో ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణ..
- 1897-99 కాలం నాటి ఫాక్స్‌సాగర్ చారిత్రక ఆనవాళ్లు చెరిపేస్తున్న కబ్జాదారులు..
- గతంలో "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్‌కి సహకరించిన జీహెచ్ఎంసి..
- సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్‌సాగర్ చెరువును బ్రిటిష్ కాలంలో నిర్మితమైంది..
- అలుగు,సర్‌ప్లస్ వాటర్ మూసీనదిలో కలిపే ఈ చారిత్రక నాలాపై భారీ అక్రమ నిర్మాణాలు..



ఫాక్స్‌సాగర్ నాలాపై సీజ్ చేసిన అక్రమ కట్టడంలో యధేచ్ఛగా పనులు.. తాజా చిత్రం..

# "హైడ్రా" పవర్ తగ్గిందా..?

# చెరువుల మరమ్మతులకే పరిమితమా..?

## 125 ఏళ్ళ ఫాక్స్‌సాగర్ నాలపై..! అక్రమ నిర్మాణం చర్యల కథ కంచికేనా..?

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, నవంబర్ 29:

125 ఏళ్ళనాటి చారిత్రక ఫాక్స్‌సాగర్ నాలా ఇపుడు కనుమరుగు అవుతుంది.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇదే ఫాక్స్‌సాగర్ నాలా బఫర్‌లో కొందరు నేతల సిఫార్సులతో "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్ నిర్మించారు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకంగా నాలాపైనే ఓ మార్వాడీ పలుకుబడితో భారీ నిర్మాణం చేపట్టడం విశేషం.. ప్రభుత్వాలు మారినా చెరువులు కుంటలు, చారిత్రక చెరువు నాలాలు కబ్జాకు గురికావడం కామన్ అయిపోయింది.. జీహెచ్ఎంసి అధికారుల చేతివాటానికి ఇదో నిదర్శనంగా చెప్పవచ్చు.. గత ఆగష్టు 16న అప్పటి సర్కిల్-25 ఏసిపి సాయిబాబా,టిపిఎస్ ప్రభావతి ఆధ్వర్యంలో సీజ్ చేశారు.. ఆతర్వాత మళ్ళీ పనులు ఎందుకు కొనసాగున్నాయి..? సంబంధిత అధికారుల చర్యలు సీజింగ్‌లు, నోటీసులు పేరుతో పేపర్‌లకే పరిమితమా..? మరోవైపు సదరు నిర్మాణ దారులు కోర్టు నుండి జీహెచ్ఎంసి జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఉన్నట్లు సమాచారంలో నిజమెంత..? ప్రస్తుత నాలాపై నిర్మాణానికి, ఎదురుగా ఉన్న.. "తిరుమల హైట్స్" బిల్డర్స్.. 2018లో ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసి ఇచ్చిన సర్వే స్కెచ్‌మ్యాప్‌లో "నాలా వెడల్పు 30 మీటర్లు (100 ఫీట్లు) రెండు వైపులా 9 మీటర్లు (30 ఫీట్ల) బఫర్ జోన్ ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.. మరి అధికారుల చర్యలు మాత్రం మొక్కుబడిగా సీజ్ చేసి వదిలేశారు..




ఫాక్స్‌సాగర్ నాలాపై గత ఆగష్టు 16న జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారులు సీజ్ చేసిన ఫైల్ ఫోటో..

- "హైడ్రా" చర్యలు సన్నగిల్లాయా..? ఇకపై చెరువుల మరమ్మతులకే పరిమితమా..?
- ఫాక్స్‌సాగర్ నాలాపై అక్రమ కట్టడాన్ని సీజ్ చేసినప్పటికీ..! బయట తాళం లోపల పనులు..!
- హైడ్రా దృష్టికి తీసుకెళ్తామన్న "నార్త్ ట్యాంక్ డివిజన్" ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ..

-2లో

# వక్ఫ్‌బోర్డు అవగాహనా రాహిత్యం..! నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు..!!

- దుండిగల్ మండలంలో వక్ఫ్‌బోర్డుకి ఉన్నది 244 ఎకరాలు.. నిషేధిత జాబితాలో 2116 ఎకరాలు..
- దుండిగల్‌లో- 72, కొంపల్లి-4, నాగులూరు-3 సర్వే నెంబర్‌లలో 244 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములు..
- ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు..
- దుండిగల్ తహాశీల్దార్‌కి, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టార్‌కి వినతిపత్రం..



-3 లో

# కేసీఆర్ వ్యక్తి కాదు..! ఒక చరిత్ర..!

దీక్షా దివాస్‌లో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్..

చరిత్రను చెరపాలని చూడడం మూర్ఖత్వమే అవుతుంది..

- గండిమైసమ్మ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మేడ్చల్ జిల్లా దీక్షా దివాస్ కార్యక్రమం..
- తెలంగాణలో ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దే:ఎమ్మెల్యే..
- తెలంగాణలో నివసించే ఏ రాష్ట్ర ప్రజలైనా మనవాళ్లే నని భావించింది బీఆర్ఎస్ ప్రభుత్వం:ఎమ్మెల్సీ..
- భారీగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు..

4& 5 లో



# "హైడ్రా" పవర్ తగ్గిందా..? చెరువుల మరమ్మతులకే పరిమితమా..?



1897 బ్రిటీష్ కాలంలో నిర్మితమైన జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు..



చెరువు అలుగు సర్‌ప్లస్ నీటిని మూసీనదికి తరలించే నాలా.. 1899లో పెట్టిన శిలాపలకం..



సుచిత్ర రోడ్డులో గతంలో ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణతో "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్.. ఫైల్‌ఫోటో..




పోతుల భావి సమీపంలో 1899 నాటి శిలాపలకం..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన "ఆపరేషన్ హైడ్రా" చర్యలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.. అట్టహాసంగా హైడ్రా ఉనికిన పరిచయం చేసిన తెలంగాణ సర్కార్ ఒక్కసారిగా వెనక్కి తగ్గడానికి కారణం ఏదైనా..! తీవ్ర విమర్శలు వస్తున్నాయి.. ప్రధానంగా బెంగుళూరు నీటి సంక్షోభం దేశవ్యాప్తంగా ప్రజలను ఉలిక్కిపాటుకు గురిచేసిన విషయం తెలిసిందే.. అందులో భాగంగా సుప్రీంకోర్టు కూడా చెరువులు, నాలాల ఆక్రమణలపై సీరియస్‌గానే ఉంది.. హైడ్రా కమిషనర్ ఏ.వి రంగానాథ్ ఐపీఎస్ చర్యల్లో కఠినంగానే వ్యవహరించారు.. ఎంతైనా ప్రభుత్వం చెప్పినట్లు అధికారులు వినాల్సిందే కదా..! హైడ్రా పవర్ తగ్గిందా..? కావాలనే కొన్ని తగ్గించారా..? కుదేలైన రియల్ ఎస్టేట్‌కి ప్రభుత్వం వెనుకడుగు వేసిందా..? చెరువుల్లో కట్టడాలు, నాలాలపై నిర్మాణాలు యధేచ్ఛగా పనులు కొనసాగటం దేనికి నిదర్శనం..? హైడ్రా సన్నగిల్లిందని వస్తున్న ఆరోపణలకు, ఫాక్స్‌సాగర్ లాంటి చారిత్రక నాలాపై కబ్జాలను సీజ్ చేసి వదిలేయడం మొక్కుబడి చర్యలుగా పరిగణలోకి తీసుకోవాలా..? అటు హైడ్రా కమిషనర్, ఇటు కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారులు, నార్త్ ట్యాంక్ డివిజన్ నీటిపారుదల శాఖ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూద్దాం..

## ఫాక్స్‌సాగర్ నాలాపై మరో భారీ అక్రమ కట్టడం..

కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధిలోని సుచిత్రా వెళ్ళే దారిలోని ఫాక్స్‌సాగర్ నాలా అధికారుల నిర్లక్ష్యంతో కుంచించుకు పోతోంది.. ఇప్పటికే "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్‌కు సహకరించిన జీహెచ్ఎంసి అధికారులు..!
ఇదే అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఫాక్స్‌సాగర్ నాలాపై ఏడాదిగా నిర్మిస్తున్న మరో భారీ అపార్ట్‌మెంట్‌కు అధికారులు సహకరించడం గమనార్హం.. పత్రికల్లో వార్తలు వస్తేనే అధికారుల దృష్టికి వచ్చినట్టు వ్యవహరించిన, జీహెచ్ఎంసి సర్కిల్-25 టౌన్‌ప్లానింగ్, అధికారులు గత ఆగష్టు 16న సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు.. ఆతర్వాత సదరు బిల్డర్ యధేచ్ఛగా పనులు చేస్తున్నప్పటికీ సైలెంట్‌గా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. అధికారుల అలసత్వంతో చారిత్రక ఆనావాళ్ళు చెరిపివేతకు గురవుతున్నాయి.. చెరువులు, నాలాల పరిరక్షణ రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన మూడు శాఖలు సహకరించడం విశేషం..

- మొదటి పేజి తరువాయి

ఓవైపు సుప్రీంకోర్టు, హైకోర్టు, ఆదేశాలు..! మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఆపరేషన్ హైడ్రా ఏర్పాటు చేసినప్పటికీ..! సంబంధిత అధికారులు చెరువులను, చారిత్రక నాలాలను కాపాడలేక పోవడం దురదృష్టకరం.. 1897-99 కాలంలో నిర్మించిన 125 ఏళ్ళ చారిత్రక కట్టడం ఫాక్స్‌సాగర్ చెరువును, సర్‌ప్లస్ వాటర్‌ను మూసీనదిలో కలిపే భారీ నాలాపై అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసి అధికారులే ప్రోత్సహిస్తున్నారని అనడంలో అతిశయోక్తి లేదు.. అక్రమ నిర్మాణాలు అంటే చర్యలు ఏమోకానీ..! బిల్డర్‌ను కలవమని అధికారులే సూచించడం పరిపాటిగా మారింది.. ఈ వ్యవహారం జీహెచ్ఎంసి, మున్సిపాలిటీలలో విపరీతంగా సాగుతున్న దందాగా పలువురు విమర్శలు చేస్తున్నారు.. కుత్బుల్లాపూర్ సర్కిల్-25 పరిధిలోని సుచిత్ర రోడ్డులో కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఫాక్స్‌సాగర్ నాలాపై" "తిరుమల హైట్స్" గత ప్రభుత్వ హయాంలో జ్ఞాపకార్థంగానూ..! నేటికీ చర్యలకు దూరంగానూ ఉన్నది చూడవచ్చు.. సుమారు రెండేళ్ళుగా వార్తలు వస్తున్నా జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఇచ్చిన "తప్పుడు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్"కే సంబంధిత అధికారులు న్యాయం చేస్తున్నారు..

## నాలాపై అక్రమ కట్టడాన్ని.. హైడ్రాకి ఇరిగేషన్ లేఖ..

ఫాక్స్‌సాగర్ నాలాపై అక్రమ నిర్మాణం విషయాన్ని "నార్త్ ట్యాంక్ డివిజన్" ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణతో ప్రస్తావించగా.. తమ నీటిపారుదల శాఖ, డీఈని పరిశీలనుకు ఆదేశించినట్లు తెలిపారు.. గతంలోనే హైడ్రా కమిషనర్‌కి లెటరు రాసినట్లు ఈఈ పేర్కొన్నారు.. అయితే తాజాగా పనులు యధావిధిగా కొనసాగటంపై ఈఈ నారాయణ దృష్టికి తీసుకెళ్ళగా..! హైడ్రా కమిషనర్‌కి మరోసారి లేఖ రాయనున్నట్లు "పెన్ పవర్" ప్రతినిధితో తెలిపారు..

## బయట తాళం.. లోపల పనులు..

ఫాక్స్‌సాగర్ నాలాపై గత ఆగష్టు 16న సీజ్ చేసిన అక్రమ కట్టడంలో నిర్మాణ దారులు తెలివిగా పనులు చేపడుతున్నారు.. సుచిత్ర రోడ్డు వైపు తాళం వేసి, దొడ్డి దారిలో పనులు చేస్తున్నారు.. వేసిన తాళం అలాగే ఉంటుంది.. నిర్మాణం మాత్రం అంచెలంచెలుగా ఎదుగుతుంది.. అధికారుల దృష్టిలో లేదంటే నమ్మవచ్చా..? సర్కిల్-25 టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపి సురేందర్ దృష్టికి తీసుకెళ్ళగా, తనకి ఇంచార్జ్ బాధ్యతలు ఇచ్చారని..! ఈ విషయాన్ని తమ టిపిఎస్‌కి ఆదేశించనున్నట్లు తెలిపారు.. నాలా ఆక్రమణలపై లిస్టుని హైడ్రాకి నివేదిక సమర్పించినట్లు కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 అసిస్టెంట్ సిటీ ప్లానర్ సురేందర్ తెలిపారు..

## ఫాక్స్‌సాగర్ నాలాపై అంచెలంచెలుగా అక్రమ కట్టడం ఫోటోలు..
























# వక్ఫ్‌బోర్డు అవగాహనా రాహిత్యం..!

# నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు..!!

దుండిగల్ మండలంలో వక్ఫ్‌బోర్డుకి ఉన్నది 244 ఎకరాలు.. నిషేధిత జాబితాలో 2116 ఎకరాలు..

దుండిగల్‌లో- 72, కొంపల్లి-4, నాగులూరు-3 సర్వే నెంబర్‌లలో 244 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములు..

ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు..

దుండిగల్ తహశీల్దార్‌కి, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టార్‌కి వినతిపత్రం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 29:** దుండిగల్‌లో ప్రవేట్ భూములపై వక్ఫ్‌బోర్డ్ పెత్తనం ఏంటి..? అంటూ కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టార్‌కి, దుండిగల్ తహశీల్దార్‌కి ఆకుల సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు.. వక్ఫ్‌బోర్డు భూములు ఉన్నది 244 ఎకరాలు కాగా..! 2116 ఎకరాలు ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టి బాధితులను ఇబ్బందులకి గురిచేస్తున్నారని ఆకుల సతీష్ మీడియా సమావేశంలో ఆరోపించారు.. దుండిగల్‌లో మొత్తం 72 సర్వే నెంబర్‌లు, కొంపల్లిలో మొత్తం 4 సర్వే నెంబర్‌లు, నాగులూరులో 3 సర్వే నెంబర్‌లో వక్ఫ్‌బోర్డుకి చెందిన 244 ఎకరాల భూమి ఉండగా..! 27 ఆగష్టు 2024న దాదాపూ 2116 ఎకరాల ప్రవేట్ భూములు చట్టం విరుద్ధంగా నిషేధిత జాబితాలో పెట్టడం అవగాహనా రాహిత్యంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.. సంబంధిత ప్రైవేటు భూములను, నిషేధిత జాబితా నుండి తక్షణమే తొలగించి, రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టార్‌కి, దుండిగల్ గండిమైసమ్మ మండలం తహశీల్దార్‌కి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు..



## సుమారు 100 సర్వే నెంబర్‌లలో.. 244 ఎకరాలు మాత్రమే వక్ఫ్‌బోర్డ్ ల్యాండ్..

వక్ఫ్‌బోర్డుకి సంబంధించిన దాదాపు (100 సర్వే నెంబర్లలో) విస్తరించి ఉన్న 244 ఎకరాల భూమికి బదులు..! అన్ని సర్వే నెంబర్ లలో మొత్తంలో భూమిని నమోదు చేయడం వల్ల దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్‌లు 84, 91, 101, 736, 746, 749 లలో మొత్తం 91 ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టగా..! సర్వే నెంబర్ 125, 128, 718, 717, 722, 723, 823, 959, 981 లలో-354 ఎకరాలు..! 24, 25, 26, 28, 29, 82, 88, 89, 94, 121, 122, 173, 467, 732, 733, 734, 739, 740, 741, 911, 928, 957, 958 సర్వే నెంబర్‌లలో 1260 ఎకరాలు భూములు, భవనాలు, ఉన్నాయని..! సర్వే నెం. 31, 75, 725, 728, 964, 965 లలో 204 ఎకరాలు కాగా..! 914 933, 947, 948, 950 లలో 25 ఎకరాలు..! 22, 23, 100, 738, 956 లలో 22 ఎకరాలు..! 83, 123, 124, 912, 917 లలో 15 ఎకరాల ప్రైవేటు భూములను కూడా వక్ఫ్‌బోర్డు భూములను అంటూ ఏ విధంగా నిషేధిత జాబితాలో పెడతారని ప్రశ్నించారు.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్, ఐజి జ్యోతి బుద్ధ ప్రసాద్ ఇష్టారాజ్యంగా నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఏ విధంగా చట్టబద్ధత అవుతుందని అన్నారు.. కొంపల్లి గ్రామ శివారు సర్వే నెంబర్‌లు 33, 34, 36, 166, 179, 180, 181 లలో 25 ఎకరాల పైచిలుకు వక్ఫ్ బోర్డు ఆస్తిగా నిషేధిత జాబితాలో ఏ విధంగా పెట్టారని అన్నారు.. అదేవిధంగా నాగలూరు గ్రామంలో సర్వేనెంబర్ 24, 354, 143, 161, 162, 163 లలో దాదాపు 10 ఎకరాలు ప్రవేటు భూములను వక్ఫ్ బోర్డ్ భూములుగా నిషేధిత జాబితాలో పెట్టడం అవగాహనా రాహిత్యంగా పేర్కొన్నారు..


మూడు గ్రామాలకు చెందిన సర్వే నెంబర్‌లలో ప్రైవేటు భూములు దాదాపు 2116 ఎకరాలు వక్ఫ్‌బోర్డు ఆస్తులంటూ ఎలా నిషేధిత జాబితాలో పెడతారు..? దుండిగల్ మండల్ పరిధిలో రెవెన్యూ అధికారుల రికార్డు ప్రకారం,వక్ఫ్‌బోర్డు సీఈఓ ఉత్తర్వుల ప్రకారం 244 ఎకరాలు మాత్రమే..!పూర్తి వివరాలు పేర్కొన కుండా.. 2116 ఎకరాల ప్రైవేట్ భూములను బిల్డింగులను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని..! తక్షణమే వక్ఫ్‌బోర్డు సంబంధించిన 244 ఎకరాల భూమిని సర్వే నెంబర్ వారిగా రెవెన్యూ అధికారుల నుంచి పూర్తిస్థాయిలో స్కెచ్ ప్లాన్, నివేదికలు పరిశీలించిన తర్వాతే నిషేధిత జాబితాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్ద నమోదు చేయాలని..! తక్షణమే 2116 ఎకరాల్లో ఉన్న ప్రైవేటు భూములను, భవనాలను నిషేధిత జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో చందు, అరుణ్ రావు, శ్యాం కుమార్ రెడ్డి, మహేందర్, ఈశ్వర్ రెడ్డి, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..



## చట్టబద్ధతను అతిక్రమించారా..? ఆకుల సతీష్ వివరణ..


ఫిర్యాదు అనంతరం ఆకుల సతీష్ వివరణాత్మకంగా వివరాలను తెలియజేస్తూ..! దుండిగల్ మండల పరిధిలో వక్ఫ్ బోర్డు సంబంధించిన ఆస్తులు రెవెన్యూ రికార్డు ప్రకారం 244.15 ఎకరాలు మాత్రమే ఉన్నాయి.. మరోవైపు వక్ఫ్‌బోర్డు గెజిట్ 7-%ఋ%, తేది: 16 ఫిబ్రవరి 1989 ప్రకారం దాదాపుగా 220 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఉన్నట్లుగా చూపిస్తూ..! నోటిఫికేషన్ విడుదలపై పూర్తిస్థాయిలో ఫిర్యాదులు కానీ, ప్రజల దృష్టికి తీసుకురావడం కానీ జరగలేదని సతీష్ స్పష్టం చేశారు.. 2017 సంవత్సరంలో టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో F.no .S-49/SLR/2017,dt% 04-10-2 017 వక్ఫ్‌బోర్డు సీఈవో జిల్లా కలెక్టర్‌కి, లేఖ రాస్తూ..! గెజిట్ నోటిఫికేషన్ 89 ప్రకారం రెవెన్యూ వెరిఫికేషన్ చేసి దాని ప్రకారం స్కెచ్‌ప్లాన్ వేసిస్తేనే సంబంధిత వక్ఫ్‌బోర్డు భూములను చట్టబద్ధత చేస్తామని, రిజిస్ట్రేషన్ శాఖలో నిషేధిత జాబితాలో పెట్టడానికి అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.. కానీ రెవెన్యూ అధికారులు, కలెక్టర్ అప్పటి ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు..

# కేసీఆర్ వ్యక్తి కాదు..! ఒక చరిత్ర..!



## దీక్షా దివాస్‌లో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్..

## చరిత్రను చెరపాలని చూడడం మూర్ఖత్వమే అవుతుంది..



- గండిమైసమ్మ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మేడ్చల్ జిల్లా దీక్షా దివాస్ కార్యక్రమం..
- తెలంగాణలో ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దే:ఎమ్మెల్యే..
- తెలంగాణలో నివసించే ఏ రాష్ట్ర ప్రజలైనా మనవాళ్లే నని భావించింది బీఆర్ఎస్ ప్రభుత్వం:ఎమ్మెల్సీ..
- భారీగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 29:** సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల పాలనలో అడుగడుగునా వివక్షతకు గురైన ప్రాంతం.. తెలంగాణ. స్వరాష్ట్ర సాధనతోనే తెలంగాణ దశ, దిశను మార్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించిన రోజు నవంబర్ 29, 2009 ను స్మరించుకుంటూ నిర్వహించే కార్యక్రమం దీక్షా దివాస్.. దీక్షా దివాస్ కార్యక్రమంలో భాగంగా,శుక్రవారం గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివాస్ కార్యక్రమానికి ఇంచార్జ్, ముఖ్యఅతిథిగా శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జ రాగిడి లక్ష్మారెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, నందికంటి శ్రీధర్ దివాస్‌లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు అమరవీరుల స్తూపానికి పుష్పాలు వేస్తూ అమరవీరుల త్యాగాలను స్మరించుకుని దీక్షా దివాస్ ప్రారంభించారు.. అనంతరం తెలంగాణ జాతిపిత కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు..

మిగతా 5లో..










# కేసీఆర్ వ్యక్తి కాదు..! ఒక చరిత్ర..!






## తెలంగాణ 60 ఏండ్లలో వివక్షతకు గురైంది:స్వామి గౌడ్..

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన స్వామి గౌడ్ మాట్లాడుతూ గత 60 ఏళ్ల కాలంలో అన్ని రంగాల్లో వివక్షతకు గురైన తెలంగాణ ప్రాంతం.. స్వరాష్ట్ర సాధన తోనే అభివృద్ధి చెందుతుందని భావించిన తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ "తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించిన రోజే ఈ దీక్షా దివాస్ అని స్వామిగౌడ్ అన్నారు.. గత 60 ఏళ్లలో అన్ని రంగాల్లో వివక్షకు గురై ధ్వంసమైన తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించడమే కాక, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలోనే దేశ తలసరి ఆదాయాన్ని మించిన ఆదాయంతో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు భయపడిన నాటి యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని..! అప్పటి హెూం శాఖ మంత్రి చిదంబరం ద్వారా అర్ధరాత్రి ప్రకటన చేయించారని గుర్తు చేశారు.. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు..

## కాంగ్రెస్ పాలకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు:ఎమ్మెల్యే వివేకానంద..

నేటి కాంగ్రెస్ పాలకులు మాత్రం తెలంగాణ చరిత్రలో కేసీఆర్‌ని ప్రజలు మర్చిపోయే విధంగా అభివృద్ధి చేస్తామంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పి వివేకానంద విమర్శించారు.. కెసిఆర్ ఒక వ్యక్తి కాదు ఒక చరిత్ర.. అంటూ కొనియాడారు.. తమ పాలనతో వ్యక్తిని మరిపించవచ్చు కానీ, చరిత్రను మర్చిపోయేలా చేస్తామని అనడం మూర్ఖత్వమే అవుతుందని ఎద్దేవా చేశారు.. సమైక్య పాలకుల చేతిలో అడుగడుగునా, వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతం స్వరాష్ట్ర సాధన తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి కేంద్రంతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు, తెలంగాణ దార్శనికుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధి ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే అభివృద్ధి మంత్రంగా రాష్ట్రాన్ని దేశ తలసరి ఆదాయంతో సమానంగా అభివృద్ధి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు..



## ఇతర రాష్ట్ర ప్రజలను కూడా మనవాళ్ళుగానే భావించాం:ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడ ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా మా వాళ్లేనంటూ సంక్షేమం, అభివృద్ధిలో కుల, మత, ప్రాంతాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాలలో జలసిరులు నింపి సస్యశ్యామలం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రపదాన నిలిచిన హైదరాబాద్ నగరాన్ని అండర్ పాసులు, ఫ్లై ఓవర్లు మెట్రో విస్తరణతో మరింత అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ మార్గదర్శకత్వం లోని టిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లో వారు చేసిన అభివృద్ధి శూన్యమని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చిన పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలిచే పరిస్థితి లేదని, ఎన్నికలు ఎప్పుడైనా బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు తమ మద్దతును తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు..

బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంతో కొట్లాడి ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు కాలనీలలో ప్రజా సమస్యలను ప్రజా ప్రతినిధుల వద్దకు తీసుకువచ్చి ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కాబట్టి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించి రానున్న జిహెచ్ఎంసి,

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా మరో మారు రెపరెపలాడే విధంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన జిహెచ్ఎంసి కార్పొరేటర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## సంగారెడ్డిలో బ్రిడ్జిని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. 30 మందికి గాయాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం కన్సాన్ పల్లి నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు హైవే బ్రిడ్జ్ ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉండగా.. దాదాపు 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు గాయాలైన వారిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరాదీస్తున్నారు. ఈ మధ్య ఓవర్ స్పీడ్.. ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్షం వల్ల తరచూ బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి.

## రితేశ్వరి ఆత్మహత్య కేసును కొట్టేసిన గుంటూరు జిల్లా కోర్టు

**2015లో వరంగల్‌కు చెందిన రితేశ్వరి ఆత్మహత్య**

**న్యాయం కోసం తొమ్మిదేళ్లుగా పోరాడుతున్న తల్లిదండ్రులు**

**ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని కేసును కొట్టేసిన కోర్టు**



**హైదరాబాద్ పెన్ పవర్:**వరంగల్ జిల్లాకు చెందిన రితేశ్వరి ఆత్మహత్య కేసును గుంటూరు జిల్లా కోర్టు కొట్టివేసింది. ర్యాగింగ్, వేధింపుల ఆరోపణలతో 2015లో రితేశ్వరి ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో న్యాయం కోసం ఆమె తల్లిదండ్రులు తొమ్మిదేళ్లుగా పోరాడుతున్నారు. రితేశ్వరి తల్లిదండ్రులు ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్నారు.

నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విద్యార్థిని రితేశ్వరి ఆత్మహత్య కేసులో కోర్టు ఈ రోజు తీర్పును వెలువరించింది. ప్రాసిక్యూషన్ నేరం నిరూపించలేకపోయిందని చెబుతూ కోర్టు కేసును కొట్టివేసింది.ర్యాగింగ్, వేధింపుల కారణంగా 2015లో రితేశ్వరి ఆత్మహత్య చేసుకుంది. తాను ర్యాగింగ్ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె సూసైడ్ నోట్ రాసింది. పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గుంటూరు కోర్టులో ఈ కేసు తొమ్మిదేళ్ల పాటు విచారణ జరిగింది. ఈరోజు కోర్టు తీర్పు వెలువరించింది.

# ధనుర్మాసం వచ్చేస్తుంది : ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే.. లక్ష్మీ కటాక్షం తథ్యం..!

**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీ మహాలక్ష్మి, సర్వమానవాళికి సిరులను కురిపించే తల్లి.. అలాంటి లక్ష్మీదేవి కటాక్షం పొందాలంటే ఓర్పు... సహనం ఎంతో ముఖ్యం. అన్ని సిరులను ఒసగే లక్ష్మిని శుక్రవారం, గురువారం ఎక్కు వగా పూజించడం పరిపాటి. గురువారానికో ప్రత్యేకత కూడా ఉందని పండితులు చెబుతన్నారు. కార్తీకమాసం పూజ పరమేశ్వరుడి కటాక్షమైతే.. ధనుర్మాసం పూజ లక్ష్మీ దేవి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది.

గురువారాన్ని లక్ష్మీ వారం అని కూడా అంటారు. ఎందుకంటే ఆ రోజు లక్ష్మికి ప్రీతికరమైన రోజు. గురువారం లక్ష్మీ పూజ చేస్తే అన్ని శుభాలే కలుగుతాయని పెద్దలు అంటారు. కానీ శుక్రవారం ప్రత్యేకించి అమ్మవారికి పూజలు చేసి దేవి కటాక్షాన్ని పొందుతారు. భక్తులు. అలాగే కార్తీకంలో తులసి చెట్టుకు పూజలు చేసి, ఉసిరి కాయలో దీపాలు వెలిగించి ఆమె దీవెనలు పొందుతారు.కార్తీకంలో తులసి లక్ష్మి పూజ అష్టైశ్వర్యాలను కలిగిస్తుందని భక్తుల విశ్వాసం.



అలాగే ధనుర్మాసం.. ధనుర్మాసం మహావిష్ణువుకి ఎంత ప్రీతికరమో.. శ్రీలక్ష్మి కూడా అంతే. ఎందుకంటే పతి ఎక్కడుంటే పత్ని అక్కడే ఉంటుంది. అందుకే ఆయన శ్రీపతి అయ్యాడు కూడా. ఈ ధనుర్మాసంలో ఉభయ సంధ్యలలో అనగా తెల్లవారుజామున.. సాయంత్రం దీపారాధన చేస్తే శీఘ్రమే లక్ష్మీకటాక్షం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. కానీ ఏ కాలమైనా భక్తితో పూజిస్తే వెంటనే కరుణిస్తుంది..

# మాలల సింహ గర్జన.. ఐక్యత కోసం.. హక్కుల కోసం: ఎమ్మెల్యే వివేక్





**హైదరాబాద్ పెన్ పవర్:**డిసెంబర్ 1న హైదరాబాద్ లో జరగనున్న మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మాలల గుర్తింపు కోసమే జాతిని ఏకం చేస్తున్నామని.. మాలల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. మాలల సింహగర్జన సభ నిర్వహణకు సంబంధించి శుక్రవారం (నవంబర్ 29) హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వివేక్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 లక్షల మంది మాలలు ఉన్నారు. ఇకనైనా మాలలు ముసుగు వేసుకుని ఇంట్లో కూర్చోకుండా బయటికి రావాలని పిలుపునిచ్చారు.

అన్నీ కులాల వారు సమావేశాలు నిర్వహించుకుంటారని.. అలాంటప్పుడు మాలలు సమావేశం జరుపుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. మేము వేరే కులాల గురించి మాట్లాడట్లేమని.. మా ఆత్మ గౌరవం కోసం పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. తక్కువ సంఖ్యలో ఉన్న మాలలు దోచుకుంటున్నారని.. ప్రభుత్వ ఉద్యోగాల్లో పోస్టులు వారికే వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు మాలలకే కాదు.. మాదిగలు, ఎస్టీలకు కూడా వ్యరేతికంగా ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు కుల వివక్ష లేదనే భావన కలిగించేలా ఉందని పేర్కొన్నారు. కుల వివక్ష, ఆర్థిక వెనుకబాటు ఒక్కటి కాదని రాజ్యాంగంలో అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ గుర్తు చేశారు. మేం ఎవరికీ వ్యతిరేకం కాదని.. రాజ్యాంగాన్ని కాపాడాలనే మా పోరాటమని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కుల వివక్ష లేదని ఏ ఒక్కరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు.

ఎస్సీ, ఎస్టీల్లో కుట్రలు ఉన్నాయి అలాంటి కుట్రలు మాలల్లో ఉండొద్దు అనేది మా లక్ష్యమని అన్నారు. మాలల హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించాం.. కానీ రాహుల్ గాంధీకి, ప్రభుత్వానికి ఎక్కడ మేం వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని ఎక్కడ లేదని.. దళితుల్లో విభజన తెచ్చే ప్రయత్నాలు చేయొద్దని కోరారు. మా మాల జాతి ఐక్యత కోసమే 2024, డిసెంబర్ 1న మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నామని.. ఈ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ పిలుపునిచ్చారు.

# నిన్న దిలావర్ పూర్.. నేడు లగచర్ల.. కాంగ్రెస్ సర్కారు తీరుపై ప్రశంసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాభీష్టానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చిన దిలావర్ పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసిన సర్కారు.. లగచర్ల రైతుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఫార్మాపై వెనక్కి తగ్గింది. ఈ మేరకు భూసేకరణ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ సేకరణ చట్టం 2013లోని సెక్షన్ 93 ప్రకారం ఉపసంహరించుకున్నట్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామాలలో ప్రజల అభిప్రాయ సేకరణ తర్వాత భూసేకరణ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటన చేశారు.

ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చింది. అప్పటి మంత్రి తలసాని కుటుంబం కోసం ఆగమేఘాలపై ఫ్యాక్టరీకి సాక్షాత్తూ కేసీఆరే అనుమతులు ఇప్పించారని ప్రభుత్వం చెబుతోంది. పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వని ఉత్పత్తులకు ఆయనే కేబినేట్ ను ఒప్పించారని తెలిపింది. ఈ ఫ్యాక్టరీకి మినహాయింపులు ఇవ్వాలని కేంద్రంపై కేసీఆర్ ఒత్తిడి చేశారని చెబుతోంది.


ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రజల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఎంక్వైరీ రిపోర్టులో నిబంధనలను తుంగలో తొక్కి గత ప్రభుత్వం అనేక మినహాయింపులతో కూడిన అనుమతి ఇచ్చినట్టు తేలింది. పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కంపెనీ ఉల్లంఘించినట్లు వెల్లడైంది. ఫ్యూయల్ ఇథనాల్ సాకును చూపించి ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మినహాయింపు పొందేందుకు ఈ కంపెనీ అడ్డదారులు అనుసరించిందని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నివేదికలో వెల్లడైంది.

కేంద్ర ప్రభుత్వం ఫ్యూయల్ ఇథనాల్ కు అనుమతి ఇస్తే.. అదేమీ పట్టించుకోకుండా ఇథనాల్, ఎక్స్ ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ లాంటి అన్ని ఉత్పత్తులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రివర్గంలో అనుమతులు ఇచ్చారని తేలింది. దీనిపై ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురు కావడంతో ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ రెండు పరిణామాలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్ నిర్వాసితులను ఇబ్బంది పెట్టిన తీరును గుర్తు చేసుకుంటున్నారు.

దౌర్జన్యంగా భూములు లాక్కోవడం.. పోలీసు బలాన్ని ప్రయోగించి సంతకాలు తీసుకోవడం.. గ్రామాలను ఖాళీ చేయించిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ వేధింపులకు బాధితులు సామూహిక ఆత్మహత్యలకు సిద్ధమైన విషయాన్ని యాది చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ ను ఓడించేందుకు ఏకంగా నిర్వాసితులు భారీ సంఖ్యలో నామినేషన్లు వేసిన సంఘటన కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును పోల్చుకుంటున్నారు. ప్రజల అభీష్టాన్ని గౌరవించి వెనక్కి తగ్గడం ఆహ్వానించదగిన పరిణామమని అంటున్నారు.

# డాక్టర్.. క్రిమినల్ గా మారాడు : పోలీస్ అవతారంలో హైదరాబాద్ వ్యాపారి కిడ్నాప్






**హైదరాబాద్ పెన్ పవర్:**డబ్బు.. డబ్బు.. డబ్బు.. కష్టపడి సంపాదించటం మానేసి.. అడ్డదారిలో కోట్లకు కోట్లు సంపాదించాలనే ప్లాన్ వేశాడు.. ఈ ప్లాన్ వేసింది కూడా ఓ మెడికల్ స్టూడెంట్.. బాగా చదివి డాక్టర్ సీటు తెచ్చుకున్నాడు.. కాలేజీలో జాయిన్ అయ్యాడు.. అక్కడే కథ అడ్డం తిరిగింది. చెడు అలవాట్లకు బానిస అయ్యాడు.. డాక్టర్ విద్యను మధ్యలోనే మానేశాడు.. డబ్బు కోసం క్లీనిక్ పెట్టాడు.. అది కూడా ఎత్తేశాడు.. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం.. మనోడికి ఉన్న అలవాట్లకు అది కూడా దివాళా తీసింది.. దీంతో డాక్టర్ కావాల్సిన వాడు.. క్రిమినల్ అయ్యాడు.. ఓ వ్యాపారిని కిడ్నాప్ చేశాడు.. హైదరాబాద్ సిటీలోనే సంచలనంగా మారిన ఈ ఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..

కొరివి ధనరాజ్.. అలియాస్ అర్జున్. డాక్టర్ విద్యను మధ్యలోనే వదిలేసి.. క్రిమినల్ గా మారాడు. ఈజీ మనీ కోసం.. ఓ వ్యాపారిని కిడ్నాప్ చేశాడు. హైదరాబాద్ సిటీ శివార్లలో మంచి ప్లాట్లు.. అపార్ట్ మెంట్స్ ఉన్నాయంటూ ఓ అమ్మాయితో నారాయణ అనే వ్యాపారికి ఫోన్ చేయించారు. అతను నిజమే అనుకుని.. 2024, నవంబర్ 21వ తేదీన ఆదిబట్లకు పిలిపించారు. వాళ్లు చెప్పిన స్పాట్ కు వెళ్లిన వ్యాపారి నారాయణను.. ఎస్సై దుస్తుల్లో ఉన్న క్రిమినల్ డాక్టర్ అర్జున్ అండ్ గ్యాంగ్ కిడ్నాప్ చేసింది.

వ్యాపారి నారాయణను కారులో ఎక్కించుకున్న అర్జున్ గ్యాంగ్.. సిటీలో తిప్పుతూ బెదిరించారు. 3 కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత డబ్బు లేదని చెప్పటంతో.. కోటి రూపాయలకు దిగారు.. అంత కూడా లేదు అనటంతో 20 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఇప్పటికి ఇప్పుడు ఆ 20 లక్షల డబ్బు ఇవ్వలేను అని చెప్పటంతో.. నాలుగు బాండు పేపర్లపై సంతకాలు చేయించుకున్నారు. పోలీసులకు చెబితే అమ్మాయిలతో ఉన్న నీ ఫొటోలు బయట పెడతానని.. మీ బంధువులకు చెబుతానని.. సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. ఈ ఘటనతో షాక్ అయిన వ్యాపారి నారాయణ.. నవంబర్ 23వ తేదీన ఆదిబట్ల పోలీసులకు కంప్లయింట్ చేశాడు. విచారణ చేసిన పోలీసులు.. మాస్టర్ మైండ్ కొరివి ధనరాజ్ అలియాస్ అర్జున్ ను అరెస్ట్ చేశారు. అతనికి సహకరించిన మరో నలుగురిని అరెస్ట్ చేశారు. వీళ్లందరూ పోలీసులుగా నటించటానికి కావాల్సిన పోలీస్ డ్రస్సులను ఆన్ లైన్ లో కొనుగోలు చేశారు. ఓ డమ్మీ తుపాకీని కూడా కొనుగోలు చేశారు. పోలీస్ విచారణలో.. పోలీస్ దుస్తులు, డమ్మీ తుపాకీ, ఓ కత్తి, బాండు పేపర్లు, షూస్ అన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు.కిడ్నాప్, బెదిరింపుల సెక్షన్ల కింద వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు పోలీసులు. ఈజీ మనీ కోసం.. జల్సాల కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ కిడ్నాప్ చేసినట్లు చెబుతున్నారు పోలీసులు. మొత్తానికి సిటీలో క్రిమినల్ డాక్టర్ కిడ్నాప్ కథ సంచలనంగా మారింది.

# ఇంట్లోకి చలిగాలి రాకుండా.. వెచ్చదనం కోసం ఈ జాగ్రత్తలు తీసుకోండి..!



**హైదరాబాద్ పెన్ పవర్:** వెచ్చదనం కోసం చలికాలంలో వెచ్చదనం కోసం స్వె టర్లు వేసుకుంటారు. వేడి ఆహారం, చర్మ సంరక్షణ కోసం క్రీమ్స్ సిద్ధం చేసుకుంటారు. మని ఇంటిని కూడా ఈ కాలానికి తగ్గట్టు మార్చుకుంటే వ్యాధులను కూడా దూరం చేయొచ్చు. చలి కాలంలో సాయంత్రం కాగానే కిటికీలను మూసేయడం మంచిది.అలాగే కిటికీ తలుపుల మధ్య చిన్న ఖాళీలున్నా కూడా చల్లగాలి లోపలికి వస్తుంది. అలా కూడా గది వాతావర ణం చల్లబడిపోతుంది. కాబట్టి అలా ఖాళీలున్నచోట మందంగా ఉండే టేపు అంటిస్తే సరిపోతుంది. చలికాలంలో సాధారణంగా మందంగా ఉన్న కర్టెన్స్ వేస్తారు. వాటికంటే కూడా కిటికీలకు, తలుపులకు ముదురు రంగుల్లో ఉండే సిల్క్ కర్టెన్స్ వాడాలి. అవి వేడిని త్వరగా గ్రహిస్తాయి. పగటిపూట వెలుతురు వచ్చే సమయాల్లో కిటికీలు తెరిచి, సాయంత్రం అవగానే మూసేయాలి. అప్పుడే గది వాతావరణం వేడిగా ఉంటుంది.

బెడ్‌రూమ్స్ లో పెద్ద కార్పెట్స్ లేకపోతే రాత్రిళ్లు పాత రగ్గులను నేలపై వేయాలి. దానివల్ల గదిలో చల్లదనం ఉన్నా రగ్గుల వల్ల ఎక్కువ చలి అని పించదు. ముఖ్యంగా నడిచేటప్పుడు పాదాలకు చల్లదనం ఉండదు. చిన్న పిల్లలుండే ఇంట్లో అయితే పెద్ద గిన్నెలో నీళ్లు వేడిచేసి దాన్ని గదిలో ఓ మూల ఉంచొచ్చు. కావాలనుకుంటే అందులో కొన్ని చుక్కల యూకలిప్టస్ నూనె వేసుకోవచ్చు. ఆ వాసన జలుబు బారి నుంచి కాపాడుతుంది. గది కూడా వెచ్చగా అనిపిస్తుంది

# ఏపీ నుంచి పూణెకు వయా తెలంగాణ.. రూ. 53 లక్షల గంజాయి స్వాధీనం



**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచలంలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఏపీ నుంచి పూణేకు వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని భద్రాచలం చెక్ పోస్ట్ దగ్గర తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నారు. ఏపీ డొంకరాయి నుంచి మహారాష్ట్రలోని పూణేకు 210 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా భద్రాచలం ఆర్టీవో చెక్ పోస్ట్ దగ్గర భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీం ఉన్నిసా బేగం సిబ్బంది కలిసి నవంబర్ 28న పట్టుకున్నారు. ద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పట్టుకున్న 210 కేజీల గంజాయి విలువ రూ 53 లక్షలు ఉంటుందని గుర్తించారు. గంజాయితోపాటు ఐదు లక్షల విలువ చేసే కారు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పట్టుకున్న భద్రాచలం ఎక్సైజ్ పోలీసులను సీఐ రహీం ఉన్నిసా బేగం, ఎస్సై అల్లూరి సీతారామరాజు సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్ రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ జి గణేష్ అభినందించారు.

## తెలంగాణలో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు శుభవార్త



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఐఆర్ పెంచుతూ జీవో జారీ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, యూనివర్సిటీల నాన్ టీచింగ్ స్టాఫ్, సహకార సొసైటీల ఉద్యోగులు, ఆయా సంస్థల పెన్షనర్లు ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా మధ్యంతర భృతి అందుకోనున్నారు. మూల వేతనం (బేసిక్ పే)పై 5 శాతం ఐఆర్ పెంచుతున్నట్టు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.ప్రభుత్వం గతేడాది అక్టోబరులో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఐఆర్ పెంచింది. తమకు కూడా పెంచాలన్న వివిధ వర్గాల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన రేవంత్ సర్కారు... ఆ మేరకు జీవో జారీ చేసింది.

## త్వరలో జమిలి ఎన్నికలు... కేసీఆర్ మళ్లీ సీఎం కాబోతున్నారు: ఎర్రబెల్లి




**హైదరాబాద్ పెన్ పవర్:**త్వరలో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు రాబోతున్నాయని... కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి కాబోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు ప్రజలు చాలా బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడవద్దని... కేసీఆర్ మరోసారి సీఎం అవుతారన్నారు.బీఆర్ఎస్ నిర్వహిస్తున్న దీక్షా దివస్ సందర్భంగా వరంగల్‌లో ఆయన మాట్లాడుతూ... జమిలి ఎన్నికలు వస్తున్నాయని... అప్పుడు కాంగ్రెస్ పార్టీకి కనీసం డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. మన ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.రాష్ట్రంలో ఎన్నో హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం పాలనను గాలికొదిలేసి తన పార్టీ నేతలతో ఢిల్లీకి వెళ్లి వస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తీరును ప్రతి ఒక్కరు గమనిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలుసా? అని ప్రశ్నించారు.


వెయ్యి మంది తెలంగాణ బిడ్డలను బలి తీసుకున్న బలిదేవత సోనియా గాంధీ అని విమర్శించారు. సోనియాను నాడు బలిదేవత అన్నది రేవంత్ రెడ్డేనని... ఇప్పుడు మాత్రం దేవత అంటున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. త్వరలో తుపాకీ రాముడి తుప్పు వదలగొడతామన్నారు.

# మేడరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**హైదరాబాద్ పెన్ పవర్:**

మేడారం.. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన వన దేవతల క్షేత్రం. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో వనం కిక్కిరిసిపోతుంది. ఇటీవల నిత్యం వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందిచనుంది.మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర.. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. గతంలో కేవలం జాతర సమయంలోనే భక్తులు వచ్చేవారు. కానీ ఇప్పుడు నిత్యం వేల మంది అమ్మవార్ల దర్శనం కోసం వస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడారం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ముఖ్యమైన 10 అంశాలు ఇలా ఉన్నాయి.

మేడారంలోని దేవతల గద్దెల ప్రాంగణం విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందనుంది.నాలుగు దశాబ్దాల కిందట దాతలు నిర్మించిన గద్దెల ప్రాంగణమే ఇప్పటికీ అందుబాటులో ఉంది. జాతరకు ముందు అప్పుడప్పుడు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. కానీ శాశ్వతంగా అభివృద్ధి చేయడం లేదు.గద్దెల ప్రాంగణం వద్ద ఎలాంటి మార్పులు చేయకపోవడంతో.. జాతర సమయంలో భక్తుల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇప్పటికే మేడారం వెళ్లే రహదారుల అభివృద్ధికి రూ.17.50 కోట్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.3.50 కోట్లు మంజూరు చేసి.. పనులు చేపట్టారుతాజాగా.. వనదేవతల గద్దెల ప్రాంగణంలో భక్తులకు



సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందినట్లు అధికారులు చెబుతున్నారు.సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొనేందుకు పస్రా, చింతల్, కొండాయి, తాడ్వాయి మీదుగా మేడారంలో ప్రవేశించి.. గద్దెల ప్రాంగణానికి చేరుకొనేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.అమ్మవార్ల గద్దెల ప్రాంగణానికి చేరుకున్న తర్వాత.. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి, ప్రశాంత దర్శనం రెండో ప్రాధాన్యతగా పనులు చేపట్టనున్నారు.దాదాపు ఎకరం స్థలంలో దేవతల గద్దెలు, ప్రాంగణం ఉంది. దీంతో భక్తుల దర్శనానికి గంటలకొద్దీ సమయం పడుతోంది. రాబోయే రోజుల్లో అన్నిరకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే.. హడావుడిగా కాకుండా ప్రణాళికబద్ధంగా నిర్మించేందుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధమవుతోంది.మేడారం అభివృద్ధిపై మంత్రి సీతక్క స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇటీవల అధికారులతో సమీక్షించారు. గద్దెల ప్రాంగణం, మేడారం రోడ్ల విస్తరణకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దేవతల దర్శనం, సౌకర్యాల కల్పనతో మేడారానికి మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు.మంత్రి సీతక్క ఆదేశాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రైవేటు ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. వాటికి అనుమతి రాగానే మాస్టర్ ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు.

# తూ తూ మంత్రంగా కులగణన

**హైదరాబాద్ పెన్ పవర్:**లంగాణ వ్యాప్తంగా కులగణన ప్రారంభమయింది. ఈ నెల మొదటి వారంలో ప్రారంభమయిన కులగణన కార్యక్రమం ప్రభుత్వం ఆశించినంత రీతిలో జరగడం లేదని సమాచారం. అనేకమంది సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారని, వాస్తవ సమాచారాన్ని తెలపకుండా దాట వేస్తున్నారని అందుతున్న సమాచారం బట్టి తెలుస్తుంది. దీంతో అసలు కులగణన వల్ల నిజాలు బయటకు వస్తాయా? ప్రభుత్వానికి వాస్తవాలు తెలుస్తాయా? అన్న సందేహం కూడా పాలకుల్లో నెలకొంది. నిజానికి బీసీ కులాల కోసం కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నెల 30వ తేదీ వరకూ కులగణన సర్వే చేయనుంది. ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించారు. అయితే ఎక్కువ ప్రశ్నలు ఉండటంతో పాటు వ్యక్తిగత ప్రశ్నలు కూడా అనేక అనుమానాలకు కారణమవుతున్నాయి. ఆస్తుల వివరాలతో పాటు అనేక అంశాలను ఎన్యుమరేటర్లు వేస్తుండటంతో ప్రజలు చెప్పేందుకు నిరా?కరిస్తున్నారు. ప్రధానంగా ఆధార్ కార్డుతో పాటు ఫోన్ నెంబరు ఇచ్చేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. ఏసీ, ఫ్రిజ్ వంటి వివరాలను కూడా అడుగుతుండటంతో కొన్ని అనుమానాలు కలుగుతున్నాయి. తమకు పూర్తి స్థాయిలో వివరాలు చెబితే సంక్షేమ పథకాలను కట్ చేస్తారేమోనన్న భయంతోనే ఈ రకమైన ప్రశ్నలకు సమాధానాలను ప్రజలు దాట వేస్తున్నట్లు తెలిసింది. తమ ఆస్తుల గురించి మీకెందుకు? ఆధార్ నెంబరు అవసరమేంటి? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వెనువెంటనే వస్తుండటంతో ఎన్యుమరేటర్లు కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. సమాధానాలు చెప్పడం కంపల్సరీ కాకపోవడంతో సర్వే కు వెళ్లిన వారు కూడా ఇక చేసేదేమీ లేక వారు చెప్పిన సమాధానాలను నోట్ చేసుకుని వెనుదిరుగుతున్నారు. అయితే రాష్ట్రంలో 97 శాతం సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, హైదరాబాద్ నగరంలో మాత్రం సర్వే నత్తనడకన సాగుతుంది. ? ఎప్పుడైనా ఎవరైనా తమ వ్యక్తిగత వివరాలను ఇచ్చేందుకు ప్రజలు ఇష్టపడరు. అది ప్రభుత్వమైనా కావచ్చు. ప్రయివేటు సంస్థ అయినా కావచ్చు. తమ పొలాలు, ఇల్లు వంటి వివరాలు చెబితే వచ్చే పథకాలు అందవని, తెలుపు రంగు రేషన్ కార్డు కూడా రద్దవుతుందేమోనన్న ఆందోళనతో అనేక మంది పూర్తి స్థాయిలో వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. మరొక వైపు సర్వే వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. తాము సమాధానం చెప్పిన తర్వాత జరిగే నష్టానికి ఎవరు బాధ్యులంటూ తిరిగి ఎన్యుమరేటర్లను ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద తెలంగాణలో గత కొంతకాలంగా జరుగుతున్న కులగణన సర్వే ఆశించిన లక్ష్యాన్ని సాధిస్తుందా? అన్న అనుమానాలు అధికార పార్టీలోనూ నెలకొనడం విశేషం. ప్రధానంగా హైదరాబాద్ వంటి నగరాల్లో పూర్తి వివరాలు ఇవ్వడం లేదని తెలిసింది.